అమ్మో ఖాళీ స్థలాలు




కంకిపాడులోని పలు ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో పెరిగిన చెట్లు, ముళ్ల కంపలు

- ప్రజారోగ్యానికి ముప్పు
- చిన్న వర్షానికి సైతం నిలిచిపోతున్న నీరు
- మురుకు కూపాలు, అరణ్యాలుగా ఖాళీ స్థలాలు
- విష కీటకాలకు ఆవాసాలుగా మారిన వైనం
- చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి

కంకిపాడు: ఖాళీ స్థలాలు. చెప్పడానికి, వినడానికి చిన్న మాటే. కానీ వీటి వల్ల ఎదురవుతున్న సమస్యలతో ప్రజారోగ్యం ప్రమాదం అంచున పడుతోంది. ప్రజల ఆరోగ్యానికి, ప్రాణాలకు రక్షణ లేకుండా పోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అన్ని ప్రాంతాల్లోనూ ఇదే దుస్థితి...

ప్రధానంగా మండల కేంద్రమైన కంకిపాడులో లెక్కకు మించి ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఏళ్ల తరబడి స్థలాలు ఖాళీగా ఉండటంతో ఆ స్థలాల్లో భారీ వృక్షాలు మొలిచి చిట్టడవిని తలపిస్తున్నాయి. పట్టణం విస్తరించడంతో అనేక ప్రాంతాల్లో నివాసాలు ఏర్పడుతున్నాయి. ఖాళీ స్థలాలు మాత్రం అలాగే ఉండటంతో పాటుగా రియల్ వ్యాపారం విస్తరణతో వాటి సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోంది. మండల కేంద్రంతో పాటుగా మండలంలోని అన్ని గ్రామాల్లోనూ దాదాపుగా ఈ సమస్య ఉంది. ఖాళీస్థలాలు పల్లంగా ఉండటంతో చిన్న పాటి వర్షానికే మురుగునీరు నిలిచిపోతుంది. రోజుల తరబడి మురుగు కదలకపోవడంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. పాములు, ఇతర విషకీటకాలకు ఆవాసంగా తయారయ్యాయి. రాత్రి, పగలూ తేడా లేకుండా ఖాళీ స్థలాల నుంచి రోడ్లు, సమీప నివాసాల్లోకి విషకీటకాలు చేరుతుండటంతో ప్రాణభయంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు అయితే ఖాళీ స్థలాలు ఉన్న రోడ్ల మీదుగా నడవాలంటేనే ప్రజలు భయాందోళన చెందుతున్న పరిస్థితి.

ఆరోగ్యానికి ముప్పు...

ఖాళీస్థలాల్లో నిలిచిపోతున్న నీరు, చెత్త వ్యర్థాలతో తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. అంతేకాకుండా మురుగు కారణంగా దోమలు విజృంభించి ప్రాణాంతక వ్యాధుల బారిన పడేలా చేసే అవకాశం ఉంది. రానున్నది వర్షాకాలం. ఈ సీజన్‌లో వర్షాలు అధికంగా కురిసి సమస్య మరింత జటిలం అయ్యే ప్రమాదం ఉంది. ముందస్తుగానే ప్రజల ఆరోగ్యానికి, ప్రాణానికి పొంచి ఉన్న ముప్పును గుర్తించి అధికారులు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. ఖాళీస్థలాలు మెరక చేయాలని, స్థలాల్లో ఉన్న చెట్లు తొలగించాలని స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని, తద్వారా సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

కాలువ కట్టలపై ఆక్రమణలు షురూ



గోసాలలో కాలువ కట్టపై ఏర్పాటు చేసిన బడ్డీ కొట్లు

పెనమలూరు: టీడీపీ అధికారంలోకి వచ్చి వారం కాకుండానే నీటిపారుదల శాఖకు చెందిన కాలువ కట్టల ఆక్రమణలు ప్రారంభమయ్యాయి. గోసాల వైకుంఠపురంలో పచ్చ నేతల అండదండలతో ఆక్రమణ దారులు బాహాటంగా అత్యంత విలువ చేసే ఇరిగేషన్ స్థలాలను ఆక్రమించే పనిలో పడ్డారు. గత రెండు రోజుల క్రితం వైకుంఠపురం వంతెన వద్ద ఇరిగేషన్ స్థలంలో టీడీపీకి చెందిన రెండు వర్గాలు పోటాపోటీగా ఆక్రమణలకు దిగారు. రెండు బడ్డీ కొట్లు పెట్టి వాటిని ఎవ్వరు తొలగించకుండా కాపలాగా ఉన్నారు. నీటిపారుదల శాఖ అధికారుల దృష్టికి స్థానికులు తీసుకువెళ్లినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆక్రమణలతో ఇప్పటికే బందరు కాలువ పరిస్థితి ప్రశ్నార్థకంగా ఉండగా టీడీపీ అధికారంలోకి రాగానే నేతల అండదండలతో మరల ఆక్రమణలు ప్రారంభమయ్యాయి.

కాలువ కట్టపై రియల్ వ్యాపారం...

గోసాల వైకుంఠపురంలో కాలువ కట్టలపై ప్రభుత్వ ఖాళీ స్థలాలు విక్రయించడానికి టీడీపీ నేతలు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణలు నివారించారు. అయితే ఇప్పుడు టీడీపీ ప్రభుత్వంలో నేతలు మరల ఆక్రమణలకు తెరలేపి సాగునీరు అందించే బందరు కాలువ కట్టలపై రియల్ వ్యాపారానికి సన్నాహాలు చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే స్థానికులు కూడా బందరు కాలువ కట్టను ఆక్రమిస్తామని చెబుతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉత్సాహంగా అంగన్‌వాడీల్లో గ్రాడ్యుయేషన్ డే



ఉయ్యూరు అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న చిన్నారులు

ఉయ్యూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే ఉత్సాహంగా నిర్వహించారు. ఉయ్యూరు పట్టణంలోని ఎస్సీ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న చిన్నారులతో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పరిమి సలోమి సంతోషి, అంగన్‌వాడీ కార్యకర్తలు సౌభాగ్యం, కనకరత్నం, సుధ, నాంచారమ్మ, మాధవి, సంధ్య పాల్గొని చిన్నారులకు సర్టిఫికెట్లను అందించారు. అలాగే కాపు రామాలయం సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో సీడీపీఓ బేబీ సుకన్య, సూపర్‌వైజర్ కల్యాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు జాకీరున్నీసా, భార్గవి, రాజేశ్వరి, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు కానూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరు గ్రామం తులసీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ కారణంగా శనివారం ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా తులసీనగర్, వరలక్ష్మీపురం, పంట కాలువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. స్థానికులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

తాడిగడపలో ఆలయ భూముల కౌలు వేలం వాయిదా

పెనమలూరు: తాడిగడప గ్రామంలో ఆలయ భూముల సాగు కౌలు వేలం పాట మరోసారి వాయిదా పడింది. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానానికి చెందిన ఆర్ఎస్ నెంబర్ 133లో 8.72 ఎకరాల సాగు భూమికి కౌలు వేలంపాట శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణంలో దేవదాయ, ధర్మదాయశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే బహిరంగ కౌలు వేలంపాటకు ఎవ్వరూ ముందుకు రాలేదు. గతంలో కూడా రెండుసార్లు కౌలు వేలం పాటకు ఎవ్వరు ముందుకు రాకపోవడంతో వాయిదా పడింది. ఆలయ భూముల కౌలు వేలంపాట ఈ నెల 20వ తేదీన ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో తిరిగి నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.మోహన్‌రావు తెలిపారు.

నేడు రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం

గన్నవరం: స్థానిక బుద్ధవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవాభవన్‌లో శనివారం రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంఘ గన్నవరం తాలుకా యూనిట్ అధ్యక్షుడు ఆవుటపల్లి మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన మాక్స్ విజన్ కంటి ఆస్పత్రి, కృష్ణసాయి దంత వైద్యశాలకు చెందిన డాక్టర్ల పర్యవేక్షణలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే ఈ వైద్య శిబిరాన్ని విశ్రాంత ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విజయవాడ భీమనవారిపేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో శుక్రవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాసన, అఖండ దీపారాధన, అంకురారోపణ, ప్రధాన కలశస్థాపన జరిగాయి. అనంతరం ప్రధాన దేవతామూర్తులకు అనుష్ఠానం నిర్వహించారు. తొలుత ఆలయంలోని దేవతామూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించగా, రామలింగేశ్వర స్వామివారిని విశేషంగా అలంకరించారు. ఆగమ ప్రతిష్టాచార్య అవ్వారి ఉమాశంకర దీక్షిత శర్మ పర్యవేక్షణలో ఆలయ వ్యవస్థాపకులు, ప్రధాన అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మ పూజలు నిర్వహించారు. పూజా తమ్మిన సతీష్, వాణి దంపతులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని వేదికపై శ్రీ శారదా నృత్య కళాపీఠానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం అందరినీ ఆకట్టుకుంది.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పెనమలూరు: గోసాల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పెనమలూరు ఎస్ఐ ఉషారాణి తెలిపిన వివరాల ప్రకారం.. గోసాలలో పోలీసులు రౌండ్స్‌లో ఉన్న సమయంలో ఈడుపుగల్లుకు చెందిన పోగుల కృష్ణ అక్రమంగా మద్యం అమ్ముతూ పట్టుబడ్డాడు. అతని వద్ద 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

విశ్రాంత హెచ్‌ఎం మృతి



గన్నవరం: విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, ఉద్యోగ సంఘ నాయకుడు పన్యారం వెంకట లక్ష్మీనరసింహారావు(93) శుక్రవారం మృతిచెందారు. గత వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్థానిక విద్యానగర్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ముస్తాబాద ప్రైమరీ స్కూల్‌లో ఉపాధ్యాయ జీవితం ప్రారంభించిన ఆయన సిరివాడ, గన్నవరం, కేసరపల్లి పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి 1988లో పదవీ విరమణ పొందారు. ఉపాధ్యాయుడిగా, ఉద్యోగ సంఘ నాయకుడిగా ఆయనకు ఈ ప్రాంత ప్రజల్లో మంచి గుర్తింపు సాధించారు. ఆయన మరణం పట్ల పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు, పుర ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

శ్రీలక్ష్మీతిరుపతమ్మకు గ్రామ పొంగళ్ల సమర్పణ



గ్రామ పొంగళ్లు తీసుకువస్తున్న భక్తులు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో జ్యేష్ఠ మాసం రెండో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి గ్రామపొంగళ్లు సమర్పించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని మాను(మహాలక్ష్మీ)కి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పొంగళ్లను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ ప్రదక్షిణల తర్వాత శ్రీలక్ష్మీతిరుపతమ్మకు పొంగళ్లను సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో శ్రీలలిత సహస్ర నామ పారాయణం జరిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, పరిసర ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల పంపిణీ



తాడిగడప మండల పరిషత్ పాఠశాలలో పుస్తకాలతో విద్యార్థులు

పెనమలూరు: పెనమలూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు పంపిణీ చేశామని మండల విద్యాశాఖ అధికారి బండి శేషగిరిరావు తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు తెలుపుతూ మండల పరిధిలో ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో కలిపి మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 30 ఉన్నాయని చెప్పారు. దాదాపు ఆరున్నర వేల మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు పంపిణీ చేశారన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం కూడా అన్ని పాఠశాలల్లో అమలు చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు వేసవి సెలవుల అనంతరం తిరిగి పూర్తి స్థాయిలో తరగతులకు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

ఓపీఎస్‌తో ఉద్యోగులకు ప్రయోజనం



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట పురుషోత్తమ రాజు

కంకిపాడు: ఓపీఎస్ విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరుతుందని ఏపీఎన్‌జీఓ కంకిపాడు తాలూకా యూనిట్ అధ్యక్షుడు ఉండి వెంకట పురుషోత్తమ రాజు అన్నారు. యూనిట్ సర్వసభ్య సమావేశం కంకిపాడు మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో సీపీఎస్ విధానం రద్దు లేదా, ఓపీఎస్‌కి సమాన విధానంపై సమీక్షించి, ఓపీఎస్ విధానం అమలుతో ఉద్యోగ వర్గాలకు మేలు చేకూరుతుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో గ్రేడ్–3గా నియమితులైన వార్డు, విలేజ్ హెల్త్ సెక్రటరీలను ఎంపీహెచ్‌ఏ (ఎఫ్)గా ఉద్యోగోన్నతి, ఆర్థిక పరమైన వెసులుబాటు కల్పించాలని కోరారు. సచివాలయాల్లోని ఆయా శాఖల ఉద్యోగులకు సీనియార్టీ తయారు చేసి విధులను నిర్ణయించాలని, మాతృ సంస్థలకు అప్పగించాలని తీర్మానించారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విజయవాడ నగర అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్, ఉయ్యూరు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కృష్ణారావు, ప్రతినిధులు రామకృష్ణ, వెంకటేశ్వరరావు, మునిరాజు, శ్యామల, అనిల్‌కుమార్, సురేష్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం తునికి చెందిన దర్పణ నాట్య అకాడమీ చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నాట్య అకాడమికి చెందిన సి.వరలక్ష్మీదేవి శిష్యబృందం పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన చేశారు. నృత్య ప్రదర్శన అనంతరం కళాబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు. ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)

రెండో రోజుకు చేరిన వార్షిక బ్రహ్మోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో ఆలయ సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఆలయ అర్చకులు స్వామివారికి నవధాన్యాభిషేకం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. లోక కల్యాణార్థం సుదర్శన నవగ్రహ హోమం, లక్ష్మీనరసింహస్వామి పాసుపత హోమం నిర్వహించారు. సాయంత్రం కుంకుమార్చనలు, స్వామివారికి ఎదుర్కోలు ఉత్సవం జరిగింది. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి పర్యవేక్షించారు.

టికెట్ బుకింగ్ కౌంటర్ ఎత్తివేత



హనుమాన్‌జంక్షన్‌లోని నూజివీడు రైల్వే స్టేషన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పరిధిలో సరుకు, ప్రయాణీకుల రవాణాలో ఎంతో ఆదరణ కలిగిన హనుమాన్‌జంక్షన్‌లోని నూజివీడు రైల్వే స్టేషన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్‌ను శుక్రవారం నుంచి నిలిపివేశారు. ఈ మేరకు రైల్వే స్టేషన్‌లోని బుకింగ్ కౌంటర్ వద్ద అకస్మాత్తుగా నోటీసు బోర్డు ఏర్పాటు చేయడం గమనార్హం. ప్రయాణీకుల సంఖ్య, టికెట్ల విక్రయాల పరంగా రాబడి ఉన్నప్పటికీ బుకింగ్ కౌంటర్‌ను మూసివేయడం స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. రైల్వేస్టేషన్లలో టికెట్ బుకింగ్‌ను పూర్తిగా ప్రైవేట్ పరం చేసే యోచనలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. హనుమాన్‌జంక్షన్ పరిసర ప్రాంతాల్లోని దాదాపు 40 గ్రామాలకు నూజివీడు రైల్వేస్టేషన్ ప్రధాన రవాణా కేంద్రంగా ఉంది. జన్మభూమి, రత్నాచల్, సింహాద్రి, తిరుమల వంటి ఎక్స్‌ప్రెస్ రైళ్లతో పాటుగా రాజమండ్రి–విజయవాడ, కాకినాడ–విజయవాడ ప్యాసంజర్ రైళ్లకు ఇక్కడ హాల్ట్ ఉంది. ఈ రైల్వే స్టేషన్ నుంచి రోజుకు సగటున 600–700 మంది ప్రయాణీకులు రాకపోకలు సాగిస్తుండగా, నెలకు సరాసరి రూ. 45 లక్షల విలువ చేసే టికెట్లను విక్రయిస్తున్నట్లుగా రైల్వే అధికారుల లెక్కలు చెబుతున్నాయి. కానీ ఈ గణాంకాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా, ప్రజాభిప్రాయంతో సంబంధం లేకుండా దక్షిణ మధ్య రైల్వే అర్థాంతరంగా టికెట్ బుకింగ్ కౌంటర్‌ను నిలిపివేసింది. దీని స్థానంలో రైల్వే స్టేషన్‌లోని బుకింగ్ కౌంటర్ వద్ద ప్రైవేట్ వ్యక్తులకు కమీషన్ పద్ధతిపై కేవలం జనరల్ టికెట్లు విక్రయించేందుకు ఏర్పాటు చేశారు. ముందస్తుగా ప్రయాణాలకు రైల్వే టికెట్లను రిజర్వేషన్ చేసుకునేందుకు కానీ, తత్కాల్ టికెట్లు కొనుగోలు చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీని వల్ల హనుమాన్‌జంక్షన్ పరిసర ప్రాంత ప్రజలు రిజర్వేషన్, తత్కాల్ టికెట్ల కోసం ఏలూరు, గుడివాడ, విజయవాడ రైల్వే స్టేషన్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైల్వే అధికారుల తీరుపై స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజాప్రతినిధులు స్పందించి నూజివీడు రైల్వే స్టేషన్‌లో యధాతథంగా టికెట్ బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని, రిజర్వేషన్, తత్కాల్ టికెట్లను విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విధుల నిర్వహణపై అవగాహన



విధుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకొంటున్న ట్రైనీ కలెక్టర్ శుభం నోక్వాల్

విజయవాడరూరల్: మండల పరిషత్, గ్రామ పంచాయతీ స్థాయిలో విధుల నిర్వహణపై అవగాహన కలిగి ఉండేందుకు ఏపీ క్యాడర్ ట్రైనీ కలెక్టర్ శుభం నోక్వాల్ వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. శుక్రవారం విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసిన ఆయన పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ ఎన్.శివరామకృష్ణను గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల నిర్వహణకు నిధుల మంజూరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, నూతన స్కూల్స్ ఏర్పాటు, నిర్మాణాలు మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్స్ వివరాలను మండల విద్యాశాఖాధికారి ఆదూరి వెంకటరత్నంను అడిగి తెలుసుకున్నారు. ఉపాధిహామీ, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, వైద్యశాఖ, ఇంకా పలు శాఖల అధికారుల నుంచి విధుల నిర్వహణ అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కళ్యాణి, వ్యవసాయశాఖ ఏఈఓ సురేష్, వెలుగు ఏపీఎం చంద్రశేఖర్, పశుసంవర్ధకశాఖ అధికారి ప్రసన్న, అధికారులను, కార్యాలయం సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. తొలుత ఎన్టీఆర్ జిల్లా పంచాయతీ అధికారి శివప్రసాద్ యాదవ్‌తో ట్రైనీ కలెక్టర్ మండల పరిషత్, పంచాయితీ, గ్రామ సచివాలయాల పనితీరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిడమానూరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు.


వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ కొడారి సృజన

మధురానగర్(విజయవాడసెంట్రల్): వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని దుర్గాపురం డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ కొడారి సృజన సూచించారు. గులాబీతోట వార్డు సచివాలయంలో శుక్రవారం పట్టణ ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. వారంలో ఒక రోజు డ్రై డేగా పాటించాలని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలు వస్తే సమీపంలోని ఆరోగ్యకేంద్రంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యకేంద్రం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు సచివాలయం సిబ్బంది, ఆశ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ట్రక్కర్స్ ప్రాజెక్టుకు రక్తదాన అవార్డు



డాక్టర్ ఉషారాణి చేతుల మీదగా అవార్డు అందుకుంటున్న సాంబశివరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అంపాపురంలోని మోడల్ డ్రైవింగ్ స్కూల్‌లో క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నందుకు గాను బెస్ట్ రక్తదాన అవార్డును అందజేశారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ జూపూడి ఉషారాణి చేతుల మీదగా ట్రక్కర్స్ ప్రాజెక్టు మేనేజర్ వీవీ సాంబశివరావు అవార్డును అందుకున్నారు. ది కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ డ్రైవింగ్ స్కూల్‌లో క్రమం తప్పకుండా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుంటారు. అలా అత్యధిక రక్తదాన శిబిరాలు నిర్వహించినందుకు గాను ఈ అవార్డు లభించింది. అంతేకాక గతంలో రెండు సార్లు ఏపీశాక్స్ నుంచి ట్రక్కర్స్ ప్రాజెక్టుకు జిల్లా కలెక్టర్ అవార్డులు అందజేసినట్లు సాంబశివరావు తెలిపారు.

కానూరులో రక్తదాన శిబిరం

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం రక్తదానం చేశారు. అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, నాగార్జున ఆస్పత్రి ఆధ్వర్యాన కాలేజీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యార్థులు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్న వారిని కాపాడగలుగుతామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకుని రక్తదానం చేయాలని కోరారు.